# సాధింపు

"అమ్మాయీ కాంతం. బావ ఇంకా యింటికి రాలేదే?"

"వస్తారు అన్నయ్యా వచ్చే వేళ అయింది వస్తారు?"

"బావ తమాషా మనిషేనమ్మా."

"ఏమిటి తమాషా అన్నయ్యా అదిగాదు అన్నయ్యా. నేను అనటం, ఏదో చిన్నతనంలో ఎల్లాగ ఉన్నా సరి పోయింది. పిల్లా జెల్లా ఉన్నవాళ్ళము కదా ఇప్పుడైనా కాస్త జాగ్రత్తగా ఉండవద్దూ, ఏమంటావు?"

"ఉండొద్దమ్మా మరి! ఉండటం లేదా?"

"ఏం ఉండటం! ఆ పుస్తకాలన్నీ ఆయన కొన్నవే! .........ఎందుకు చెప్పు అన్నయ్యా అవన్నీ?"

"ఎందుకేమిటి? చదువుకోంటానికి. ఆ విషయంలో నీవు అడ్డు పెట్టకూడదమ్మా."

"నే నేమీ అడ్డు పెట్టటంలేదు. అన్నయ్యా, చదువుకో వద్దని ఎవరంటారూ?"

"మరి ఏమిటే నీవు అనటం?"

"ఊఁ ఆ పుస్తకాలన్నీ చదివినప్పుడు శాస్త్ర జ్ఞానం రావాలే!"

"అవును. జ్ఞానానికి కాకపోతే ఎందుకూ ఆ పుస్తకాలూ ఇప్పుడు వాడు జ్ఞానంలేక ఏం జేస్తున్నాడంటావు?"

"ఏం జెయ్యాలె అన్నయ్యా, ఆ ఏడు కాయేడు పైనబడ్డ కొద్దీ కాస్త తెలియాలె ఇది సంసారం, పిల్లలూ అన్న సంగతి."

"తెలియవద్దమ్మా మరీ! అయితే వాడికి ఆ తెలియ లేదంటావా?"

"ఆఁ తెలిస్తే ఏమైనట్లు!"

"ఏం జేస్తున్నాడమ్మా ఇంట్లోకి కావలసిన వస్తువులూ అవీ తీసుకురాకుండా ఏడిపిస్తున్నాడా?"

"అఁ హాఁ అదేంలేదు అన్నయ్యా నెలకు కావలసిన వస్తువులన్నీ ఒకేసారి తెచ్చి పారేస్తారు, ఏ హేమీ ఇబ్బంది లేదు"

"అయితే పిల్లలకూ నీకూ కావలసిన బట్టలూ, అవీ......"

"ఎబ్బెబ్బె కావలసినన్ని బట్టలు ఉన్నయి. పిల్లలకూ నాకూ కట్టుకునేందుకూ దాపుడుకూ కూడా ఉన్నయి?"

"సరే బాగనే ఉంది. అయితే ఏమిటి నీవు అనటం?"

"ఏమీలేదు అన్నయ్యా, కాస్త వివేకం ఉండాలె అంటా. పెద్ద చదువులు చదివి ఏం లాభం?"

"వివేకం ఉండవలసిన మాట నిజమే—తప్పకుండా ఉండాలె. కాని ఏం జేస్తున్నా డంటావమ్మా వివేకం లేకుండా?"

"నేను చెప్పేమాట ఒక్కటే అన్నయ్యా. కాస్త వెనకా ముందూ చూచుకోవాలె అంటా ఏమంటావ్."

తప్పకుండా చూచుకోవద్దూ మరీ! అయితే."

"మాటకు అడ్డొచ్చా—అదీ కాక నేను చెప్పేది ఒక్కటే అన్నయ్యా. ఇన్నిమాట లెందుకూ."

"ఏమిటమ్మా తల్లీ ?"

"చెపుతున్నా ఇప్పుడూ-ఆయనని ఏమిటి, ఎవరైనా సరే......ఊరికే గుడ్డి ఎద్దు చేలోపడ్డట్టు పోగూడదు. అవునా ?"

"అవునూ! కాదని ఎవరంటారు ?"

"అదీ సంగతి తెలిసిందా ?"

"నాకేమీ తెలియలేదు !"

"నువ్వూ ఇట్లాగ అంటావేం అన్నయ్యా. ఇప్పుడూ ......మన ఇబ్బందులు ఎల్లాటివో ఇతరులవీ అల్లాటివే అనుకోవాలా ?"

"అవునమ్మా తప్పకుండా అనుకోవాలె. ఇంతకూ నీ కంప్లేంటు ఏమిటో నాకు కాస్త తెలిసే లాగున చెప్పు."

"ఆ కంప్లైంటూ నా బొందానూ! కంప్లైంటు కూడానూ నాకుతోడు ! ఏంలేదు అన్నయ్యా. మన సంగతి ఏమిటీ,— మనస్థితి ఎట్లాంటిదీ...ఊ...మన పిల్లలూ మనమూ...... ఊ...ఏమంటావ్ అన్నీ చూసుకోవద్దూ ?"

"తప్పకుండా చూచుకోవాలె. అవును గాని నీ దేదో గొడవగా ఉంది. వాడు చేస్తున్న అన్యాయం ఏమిటో నాకు స్పష్టంగా చెప్పు."

"పెద్ద అన్యాయం ఏముంది అన్నయ్యా. పాపం మాటలు ఎందుకు! ఆయన చేస్తున్న అన్యాయం ఏముంది అయినా!"

"అయితే ఏమంటావ్రా ?"

"ఏం లేదులే అన్నయ్యా, నీకుకూడా విసుగ్గా ఉంటే నేనేం జేసేది!"

"విసుకు కాదమ్మా పిచ్చి తల్లీ—నీవు ఏమంటావో తెలియటంలేదు."

"తెలిసేందు కేముందిలే...ఇవుడు నే ననటం ఆయన కైనా చిన్నతనం కాదు—దగ్గర దగ్గర ముప్పై ఏండ్లు ఉన్నాయి!"

"ఉంటే?"

"ఉంటేనా ? ఉంటే ఏముంది! అయిదుగురు పిల్లల తండ్రి అయినారు!!"

"అయితే..."

"ఏమిటి అన్నయ్యా నీవుకూడా కాకపోయినా అట్లా మాట్లాడుతావ్రా ?"

"ఎట్లా మాట్లాడానమ్మా ? ఏంజేయమంటావ్ ?"

"ఏం జేస్తావా ? కాస్త ఆయనతో చెప్పు."

"ఏమని చెప్పమంటావ్ ?"

"ఈసారి! రెడ్డొచ్చె మొదలాడమన్నాడట!ఇందాకటి నుంచి చెపుతున్నదంతా పోయింది?"

"నాకు అసలు నీవు ఏమంటున్నావో, వాడిని ఏ విషయంలో కూక వేయమన్నావో తెలియందే !"

"ఇది మరీ బాగుంది. రామాయణం అంతా విని రాముడికి సీత ఏమౌతుంది అడిగ్గాట్ట!! అల్లాగ ఉందినీమాట!"!

"నాకు తెలియవమ్మా నీ సాధింపులు. ఫలాని విషయంలో ఇల్లాగ వాడు కూడని పని చేస్తున్నాడు అని చెప్పు. నేను వాడిని అడుగుతాను. కూక వేస్తాను. ఇందాకటినుంచీ నీవు ఏమిటో అంటావు. నీ మనస్సులో సంగతి తెలియదాయె."

"ఏముంది గాని అన్నయ్యా...అదుగో...మీా బావ వస్తున్నారు...కాస్త చెప్పు...ఇల్లాగ కాదు 'అబ్బాయి. కాస్త జాగ్రత్తగా ఉండమనీ! గట్టిగా చెప్పు అన్నయా..."